

చవితి వేడుకలకు ముస్తాబు

వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. వినాయక ప్రతిమలు, పూలు, పత్రి కొనుగోలు చేశారు.

- 8లో..



సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. వైపాలెం మండలం తమ్మడపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

గుండ్లకమ్మ పదిలం..

భవిష్యత్‌లో గుండ్లకమ్మ ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేయడం..కనీస నిర్వహణ గాలికొదిలేయడంతో గేట్లు తుప్పుబట్టి మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా ఒక గేటు విరిగిపోయింది. రానున్న కాలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ప్రాజెక్టుకు చెందిన 15 గేట్లు మరమ్మతులు చేయాలా ? పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాలా? అన్న అంశంపై చర్చిస్తోంది. ఇప్పటికే నిధులు కేటాయించింది. 15వ తేదీ పరిపాలన అనుమతులు సైతం ఇచ్చింది. త్వరలో పనులు ప్రారంభించేలా నిర్ణయం తీసుకోనుంది.



గుండ్లకమ్మ ప్రాజెక్టు

- ప్రాజెక్టు గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులా? కొత్తవి ఏర్పాటా..?
- రూ.9.40 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం.. జీవో విడుదల
- గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలోని రైతులను, ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు
- గుండ్లకమ్మను గాలికొదిలేసిన టీడీపీ ప్రభుత్వం
- ఒక గేటు దెబ్బతినేసరికి గగ్గోలు పెట్టిన టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గుండ్లకమ్మ ప్రాజెక్టుకు దశ తిరగనుంది..రైతుల కల నెరవేరనుంది. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ఆర్ కలలు పూర్తిగా సాకారం కానున్నాయి. తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సిద్ధమయ్యారు... అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తూనే ఉన్నారు. గుండ్లకమ్మకు భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 15 గేట్లకు మరమ్మతులు చేయడం లేదా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ మేరకు ఈ నెల 15వ తేదీన పరిపాలనా పరమైన అనుమతులు ఇస్తూ జీఓ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ రూ.9.40 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్పిల్ వే గేట్ల స్థానంలో మరమ్మతులు చేయటమా, లేక పాత వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయటమా అన్నది స్పిల్ వే గేట్ల సామర్థ్యాన్ని బట్టి నిర్ణయం తీసుకోనున్నారు. స్పిల్‌వే గేట్లు, వాటి గడ్డర్లు అన్నింటినీ బలోపేతం చేయటానికి ఈ నిధులు వెచ్చించనున్నారు. మరో వారం రోజుల్లో సాంకేతికపరమైన అనుమతులు వచ్చిన తరువాత టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తారు. నెల రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నారు.

1,42,428 ఎకరాలు సాగులోకి...

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ (కాడ్‌వాం) పథకం కింద నిధులు మంజూరు చేయించారు. ప్రాజెక్టు కుడి కాలువ, ఎడమ కాలువలను నిర్మించేందుకు ఈ నిధులు కేటాయించారు. అందులో భాగంగా ఆయకట్టు అభివృద్ధి కోసం రూ.93.90 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పూర్తి స్థాయి పనులు చేపట్టారు. ఈ నిధులు వెచ్చించి పనులు పూర్తయితే ప్రాజెక్టు కింద ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి మొత్తం 1,42,428 ఎకరాలు సాగులోకి రానుంది. మొత్తంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద ఒక్కో సీజన్‌లో దాదాపు 80 వేల ఎకరాల వరకు సాగులోకి తీసుకురావాలన్నది దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి ఆశయం. అందుకు అనుగుణంగా ప్రస్తుతం ఈ నిధులు మంజూరు చేశారు. చివరి భూముల వరకు నీరందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

తొమ్మిది మండలాలకు ప్రయోజనం...

గుండ్లకమ్మ ద్వారా తొమ్మిది మండలాలకు ప్రయోజనం చేకూరనుంది. మద్దిపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, జే.పంగులూరు, కొరిశపాడు, ఇంకొల్లు, చినగంజాం, ఒంగోలు మండలాల్లో అన్నదాతలకు అండగా నిలవనుంది. ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 62,368 ఎకరాలకు, రబీ సీజన్‌లో 80,060 ఎకరాలకు సాగు నీరు అందించటంతోపాటు ఒంగోలు నగరంతో పాటు 43 గ్రామాల పరిధిలో 2.56 లక్షల మందికి తాగునీరు అందించటమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

వైఎస్ హయాంలోనే పనులు వేగం:

ప్రాజెక్టు నిర్మాణ పనులను మంజూరు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఆయన ఐదేళ్ల పాలనలో గుండ్లకమ్మ ప్రాజెక్టు కోసం అవసరమైనన్ని నిధులిచ్చి జిల్లాపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. ప్రాజెక్టు పనుల కోసం 2004-05లో రూ.25.63 కోట్లు, 2005-06 లో రూ.69.44 కోట్లు, 2006-07లో రూ.210.67 కోట్లు, 2007-08లో రూ.132.58 కోట్లు, 2008-09లో రూ.48.79 కోట్లు నిధులు కేటాయించారు. అయితే అప్పటికే దాదాపు పనులు పూర్తి కావటంతో 2008 నవంబర్ 24న గుండ్లకమ్మ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. ఆ తరువాత కూడా మిగిలిపోయిన పనులను పూర్తి చేయించేందుకు నిధులు కేటాయించారు. 2009-10 ఏడాదికి రూ.56.32 కోట్లు అందించారు. మొత్తం కలిపి రూ.534.43 కోట్లు అందించి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేయించారు.

ప్రాజెక్టును గాలికొదిలేసిన బాబు:

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 2014 నుంచి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కంటి తుడుపుగానే నిధులిచ్చారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నిపుణుల కమిటీ గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు వచ్చి 2016లో పరిశీలన చేశారు. నిపుణుల సిఫార్సుల మేరకు స్పిల్ వే గేట్ల గడ్డర్లు, ప్లేట్లు, గేటు పరికరాలు బలోపేతం చేయాలని నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించారు. స్పిల్ గేట్ల నిర్వహణ కూడా చేపట్టాలని ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే చంద్రబాబు మాత్రం అవేమీ పట్టించుకోకుండా తోట నిర్వహణ, ప్రాజెక్టు సుందరీకరణ పేరుతో నిధులు మంజూరు చేశారు. టీడీపీ నాయకులు మాత్రం వాటిని కూడా తూ..తూ మంత్రంగా పనులు చేపట్టి వచ్చిన నిధులను దోచుకున్నారు. ప్రాజెక్టు పేరుతో ఆర్థికంగా లబ్ధి పొందేందుకు జీఓ నంబర్ 22ను తెరపైకి తెచ్చారు. తద్వారా పెద్ద ఎత్తున నిధులు బొక్కేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం 2016 జూన్‌లో ప్రాజెక్టు అంచనాలను రూ.768.18 కోట్లకు పెంచారు. అయితే అప్పట్లో విమర్శలు రావటంతో కనీసం ఆ నిధులను చంద్రబాబు ప్రభుత్వం కేటాయించనే లేదు.

టీడీపీ పాలకుల నిర్లక్ష్యంతోనే కొట్టుకుపోయిన 3వ గేటు:

గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల నిర్వహణ కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించారు. అయితే ఆ నిధులు గేట్ల మరమ్మతుల కోసం కాకుండా ప్రాజెక్టు సుందరీకరణ కోసం ఖర్చు చేశామని చెబుతున్నారు. దాదాపు రూ.3 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తే వాటిని గేట్ల మరమ్మతులకు కేటాయించకుండా గేట్ల నిర్వహణను గాలికి వదిలేయటం వల్లనే మూడో గేటు కొట్టుకుపోయింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నిర్వహణ పనులు గాలికి వదిలేసిన నాయకులు ఒక గేటు కొట్టుకుపోయేసరికి గగ్గోలు పెట్టారు.

స్పిల్ వే గేట్ల మరమ్మతుల కొత్తవి ఏర్పాటు



రాష్ట్ర ప్రభుత్వం గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల మరమ్మతులు, లేదా వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయటానికి నూతనంగా రూ.9.40 కోట్లు మంజూరు చేసింది. ప్రధానంగా 12 గేట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయటానికి ఉద్దేశించి ఈ నిధులు విడుదల చేశారు. పరిపాలనా పరమైన అనుమతులు వచ్చాయి. త్వరలో టెక్నికల్ సాంక్షన్ వస్తుంది. వచ్చిన వెంటనే టెండర్ ప్రక్రియను ప్రారంభించి కనీసం ఒక నెల రోజుల లోపే పనులు ప్రారంభించేందుకు పూనుకుంటాం. కొట్టుకుపోయిన మూడో గేటును బయటకు తీసే ప్రక్రియను ప్రారంభించాం. ప్రాజెక్టులోని నీరు వృథాగా బయటకు పోయే వీలు లేకుండా చర్యలు తీసుకున్నాం.

- సొధాఘర్ అబుతలీం, ఎస్.ఈ, జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్టుల విభాగం

న్యూస్‌రీల్

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి ఆదిమూలపు సురేష్



స్వామివారికి పూలమాల వేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: స్థానిక గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మద్విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి సందర్భంగా ఆదివారం ఆయన దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు వడ్లమాను గోవర్ధనాచారికి మంత్రి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, వేణుగోపాలస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ యక్కలి భాగ్యారావు, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, ఎన్.వెంకటరెడ్డి, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

ఒంగోలు: వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ ఆకాంక్షించారు. విఘ్నాలకు, సకల దేవగణాలకు అధిపతి అయి న వినాయకుని ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజించి సకల కార్యసిద్ధి పొంది ఆనందమయ జీవితాన్ని పొందాలని కోరారు. వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎస్పీ స్పందనకు సెలవు

ఒంగోలు టౌన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని సోమవారం సెలవు దినం కావడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. వినాయక చవితి పండుగ రోజు నుంచి నిమజ్జనం వరకు జరిగే శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

దొడ్డా మహీధర్‌రెడ్డి సస్పెన్షన్

ఒంగోలు: పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకుగాను కొండపి నియోజకవర్గం సింగరాయకొండ మండలానికి చెందిన దొడ్డా మహీధర్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- చింతాయగారిపాలెం, పెద దేవరంపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



చింతాయగారిపాలెంలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న బాలినేని

ఒంగోలు రూరల్ (నాగులుప్పలపాడు): సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందడంతో పాటు ప్రతి గ్రామంలో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒంగోలు రూరల్ మండలం చింతాయగారిపాలెం, పెద్ద దేవరంపాడు గ్రామాల్లో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేనికి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారుల సహకారంతో చాలా వరకు అక్కడికక్కడే బాలినేని పరిష్కారం చూపారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ఉప్పు కొఠార్లకు వెళ్లే రోడ్లను మన ప్రభుత్వంలోనే పూర్తి స్థాయిలో చేయగలిగామని గ్రామస్తులకు వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను నేరుగా ప్రజల వద్దకు తీసుకొచ్చి పరిపాలనను గ్రామాల్లోకే తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని తెలిపారు. భవిష్యత్‌లో మనందరం జగనన్నకు తోడుగా ఉండాలని కోరారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకోవడంతో పాటు బీపీ, షుగర్ వంటి పరీక్షలు స్వయంగా చేయించుకున్నారు. కార్యక్రమంలో ఒంగోలు, నాగులుప్పలపాడు మండలాల ఎంపీపీలు పల్లపోలు మల్లికార్జున్ రెడ్డి, నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చుండూరి రవి, మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు, వారా వీర్రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, గ్రామ సర్పంచ్ నాయుడు శ్రీరాములు, కరవది పీఏసీఎస్ అధ్యక్షుడు వాకా కృష్ణారెడ్డి, పోలినేని కోటేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, పీ పవన్ కుమార్, ఘట్టమనేని అశోక్, చప్పిడి సోమశేఖర్, మన్నే శ్రీనివాసరావు, ఈదర చిన్నారి, వడ్లమూడి మురళి, బ్రహ్మయ్య, వెంకట సుబ్బయ్య ఉన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి ఐఈఆర్పీల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఐఈఆర్పీలు

ఒంగోలు టౌన్: వేలాది మంది దివ్యాంగులకు 22 సంవత్సరాలుగా సేవలు చేస్తున్న ఐఈఆర్పీలను ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారికి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన విధంగానే 23 శాతం పీఆర్సీ ఇచ్చింది. దీంతో ఒంగోలు నగరంలోని పలువురు ఐఈఆర్పీలు సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 980 మంది ఐఈఆర్పీలు ఉన్నారని, వీరంతా భవిత సెంటర్ల ద్వారా 87 వేల మంది దివ్యాంగులకు సేవలను అందిస్తున్నారని చెప్పారు. జీతాలు పెంచేందుకు తమవంతు కృషి చేసిన నాయకులకు ఐఈఆర్పీ సంఘం ప్రెసిడెంట్ జి.అరుణ కుమారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, మల్లికార్జునరావు, వెంకటరెడ్డి, సంజీవరావు, సుకవిత, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

వేకువన విషాదం

- మద్దిరాలపాడు 216 జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న మోటారు సైకిల్
- ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం
- రాత్రంతా అమ్మవారి కొలుపుల్లో సంతోషంగా గడిపిన యువకులు
- వినాయక విగ్రహానికి అడ్వాన్స్ ఇచ్చి తిరుగు ప్రయాణంలో కబళించిన మృత్యువు



కుమార్తె పుట్టినరోజు వేడుకల్లో భార్య, కుమార్తెతో మర్రిబోయిన గోపి (ఫైల్)



మర్రిబోయిన మణికంఠ (ఫైల్)



బత్తిన అరవింద్ (ఫైల్)



సంఘటనా స్థలంలో గుట్టగా పడిన యువకుల మృతదేహాలు

నాగులుప్పలపాడు/మేదరమెట్ల: వినాయక చవితి పర్వదినాన గ్రామంలో పెట్టే వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ ఇచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మద్దిరాలపాడు సమీపంలోని 216 జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన మర్రిబోయిన గోపి (27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అమ్మవారి కొలుపులు, వినాయక చవితి పండుగ నేపథ్యంలో గ్రామానికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన ఒకే సామాజికవర్గానికి చెందిన బత్తిన అరవింద్ (19), మర్రిబోయిన మణికంఠ (21) లతో కలిసి శనివారం రాత్రంతా గ్రామంలో జరిగిన అమ్మవారి కొలుపుల్లో సంతోషంగా గడిపారు. ఆదివారం వేకువ జామున 4 గంటల సమయంలో ఒంగోలు వెళ్లి వినాయక విగ్రహానికి అడ్వాన్సు ఇచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మద్దిరాలపాడు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై పంక్చరు పడిన లారీ ఆగి ఉంది. దీనిని గమనించని యువకులు తమ మోటారు సైకిల్‌తో వెళ్లి బలంగా ఢీకొట్టడంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

పమిడిపాడులో విషాదఛాయలు:

మృతులు ముగ్గురూ కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన వారు...అదీ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల్లో మర్రిబోయిన గోపి (30) ఐదేళ్లుగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది పాప ఉంది. మూడు రోజుల క్రితమే పాపకు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంతలోనే కొలుపులకు అని వెళ్లిన వ్యక్తి విగత జీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గోపీకి కవల సోదరుడు ఉన్నాడు.

మర్రిబోయిన మణికంఠ (22) తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కుమారుడు. తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డిగ్రీ డిస్‌కంట్యూ చేసి ఖాళీగా ఉన్నాడు. వివాహం కాలేదు. బత్తిన అరవింద్ (21) తల్లిదండ్రులకు రెండో సంతానం. ఇతనికీ వివాహం కాలేదు. తండ్రి గొర్రెల కాపరి. చేతికి అందివచ్చిన బిడ్డలను మృత్యువు కబళించడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత ప్రామాణికమని, కుల, మత, వర్గాలు, రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలంలో అవ్వ, తాతలకు పింఛన్ మంజూరు చేసేందుకు రాజకీయ పార్టీలతో సంబంధం పెట్టేవారని, అర్జీలు పెట్టుకోవటానికి నెలల తరబడి జన్మభూమి కమిటీల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, రేషన్ కార్డు కావాలంటే పచ్చకండువ కప్పుకుంటేనే అది సాధ్యమవుతుందనేవారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయటానికి వారి చేతులు తడపాల్సిన పరిస్థితి ఏర్పడేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి తలెత్తకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వారి ద్వారానే పింఛన్లతో పాటు సంక్షేమ పథకాలు అర్హులందరికీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న పరిపాలన విధానాన్ని చక్కగా గాడిలో పెట్టారన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, పేద మహిళల సొంతింటి కల నెరవేర్చేందుకు జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం కింద అర్హులందరికీ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న పేదలందరినీ ఆర్థికంగా ఆదుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి తపన పడుతున్నారన్నారు. పేదరిక నిర్మూలనకు ఆయన కట్టుబడి ఉన్నారని, అటువంటి నాయకుడిని రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించాలన్నారు. తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎంను చేసుకోవటానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ఒక మాట, ఆ తరువాత మరోమాట మాట్లాడే వారిని తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. ముందుగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 17.50లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జార్జి విద్యాసంస్థల కార్యదర్శి ఆదిమూలపు విశాల్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, గాలి చిన్న శ్రీనివాసులురెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ శివారెడ్డి, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, పీఆర్ డీఈ బి.సుబ్బారెడ్డి, హౌసింగ్ డీఈ రమేష్‌బాబు, సీడీపీవో పద్మావతి, ఈవోపీఆర్డీ ఈదుల లక్ష్మిరెడ్డి, కె.లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

ఒంగోలు టౌన్: నగరంలోని బాలాజీనగర్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాలాజీ నగర్‌లోని హోసన్నా మందిరం సమీపంలోని బీసీ ఎంప్లాయిస్ పార్క్ వద్ద పొలాల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు ఎరుపు రంగు టీషర్టు, సిమెంట్ రంగు షర్టు ధరించి ఉన్నాడు. కుడి ముంజేతి మీద క్రాస్ గుర్తు, మామ్ అని ఇంగ్లిష్ అక్షరాలు పచ్చబొట్టు వేసి ఉన్నాయి. మృతుని 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుందని భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9121102125కు ఫోన్ చేసి సమచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. టూటౌన్ ఎస్సై సాంబశివరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- వేగంగా ప్రయాణించే వారు కుటుంబం గురించి ఆలోచించాలి
- ప్రతి ఒక్కరి ప్రాణాలు విలువైనవే
- హైవేల పక్కన వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ మలికాగర్గ్ సూచన


ఎస్పీ మలికాగర్గ్ (ఫైల్)

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించడం ఒక్కటే పరిష్కారమని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహనదారులకు తన ప్రాణాలు, తన కుటుంబం ఎంత ముఖ్యమో ఎదురుగా వాహనంలో వస్తున్న వారి ప్రాణాలు కూడా వారి కుటుంబాలకు అంతే ముఖ్యమన్న సంగతిని గుర్తించాలని హితవు పలికారు. ఇంటి నుంచి బయలుదేరిన తరువాత క్షేమంగా తిరిగి రావాలని ప్రతి ఒక్క కుటుంబం కోరుకుంటుందని, రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వాహన చోదకులకు రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలను నడిపితే ఎంవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నో యాక్సిడెంట్ డే, స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. లారీలు, ట్రాక్టర్లు, ఇతరా వాహనాలు ఓవర్‌లోడుతో పాటుగా వేగంగా వాహనాలను నడుపుతుండడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఓవర్ లోడుతో కర్ర ట్రాక్టర్లు రహదారిపై ప్రయాణించే సమయంలో ఇతర వాహనాలకు ఇబ్బంది కలుగుతుందని, రాత్రిళ్లు సింగిల్ రోడ్లలో హెవీలోడ్ వాహనాలు ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వివిధ కారణాలతో రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాల వద్ద ప్రత్యేక సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే మొబైల్ సిబ్బంది వారి పరిధిలో తరుచూ గస్తీ నిర్వహించాలని, అధికారులు తరుచూ గస్తీని పర్యవేక్షించాలన్నారు. హైవే మార్జిన్లపై వాహనాలను పార్కింగ్ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలను నియంత్రించాలని ఎస్పీ ఆదేశించారు.




పత్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్

చవితి వేడుకలకు ముస్తాబు


క్రేన్ సాయంతో వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తూ..


మండపాలకు తరలుతున్న గణనాథుళ్లు

ఒంగోలు మెట్రో: ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించుకునే వినాయక చవితి ఉత్సవాలకు ఒంగోలు నగరం ముస్తాబైంది. వీధి వీధినా గణేష్ మండపాలు వెలిశాయి. స్థానిక ఉత్సవ కమిటీలు, భక్త బృందాలు సోమవారం వినాయక చవితి వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి కుటుంబసమేతంగా పత్రి, వినాయక ప్రతిమలను కొనుగోలు చేశారు. ఫ్రెండ్స్ క్లబ్, వాసవీ చారిటబుల్ ట్రస్ట్, ఇతర సంస్థలు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. గణపతి మండపాలలో పందిళ్లు వేసి వాటికి చక్కగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

సోమవారమే వినాయక చవితి

వినాయక చవితి సోమవారమే జరుపుకోవాలని ప్రముఖ వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రి, వేద పురోహితులు కప్పర రామ కుమార శర్మ తెలిపారు. వినాయక చవితి రోజు మధ్యాహ్న సమయానికి పూజ చేసుకొని సాయంత్రానికి చవితి చంద్రుని చూస్తామని, సోమవారం ఉదయం 10 గంటల నుంచి చవితి తిథి వస్తుందని, ఆ తిథి సాయంత్రం చంద్రోదయానికి (రాత్రికి) కూడా ఉంటుందని తెలిపారు.

కళాకారులకు డిమాండ్

గణపతి నవరాత్రులు సందర్భంగా పందిళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నడంతో కళాకారులకు డిమాండ్ పెరిగింది. అలాగే పురోహితులకు, మైకు, లైటింగ్, డెకరేషన్, స్టేజీ, క్యాటరింగ్ రంగాల వారికి గణపతి నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా వారికి చేతి నిండా పని దొరికింది.


స్వామి పూజ కోసం సామగ్రితో


పూల దుకాణాల వద్ద సందడి


పత్రి కొనుగోలు చేస్తున్న మహిళలు


మహా గణపతి..మనసా స్మరామి

ఏడేళ్లకే నిండిన నూరేళ్లు..

● గుంతలో పడి బాలుడు మృతి


మహేష్‌రెడ్డి

పుల్లలచెరువు: పండుగకు ఒక్క రోజు ముందు ఆ ఇంట విషాదం నెలకొంది. పొలంలో ఉన్న గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది.వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన నారు సుబ్బారెడ్డి కుమారుడు మహేష్‌రెడ్డి(7) తన పెద్దనాన్నతో పాటు ఆదివారం సెలవు కావడంతో పొలం వెళ్లాడు. ఆ పొలంలో నీరు నిల్వ చేసేందుకు గుంతను తీశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరు చేరింది. ఆ విషయం తెలియని మహేష్‌రెడ్డి ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడి మృతి చెందాడు. మహేష్‌రెడ్డి రాత్రి యినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వెతకసాగారు. పొలం వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి పొలం వెళ్లి వెతకగా నీటి గుంతలో పడి మృతిచెంది ఉన్నాడు. మహేష్‌రెడ్డి 2వ తరగతి చదువుతున్నాడు. ఈ సంఘటనతో గ్రామంలోవిషాదఛాయలు అలుముకున్నాయి.

జనసేన నాయకుడు అరెస్టు


పట్టుబడ్డ నిందితులతో సెబ్ సీఐ అబ్దుల్ జలీల్, పోలీసు సిబ్బంది

- గోవా మద్యాన్ని అక్రమంగా అమ్ముతున్న జనసేన మండల అధ్యక్షుడు
- అతనితో పాటు మరో ఇద్దరు అరెస్టు

కనిగిరి రూరల్: గోవాకు చెందిన మద్యాన్ని అక్రమంగా కనిగిరిలో అమ్ముతున్న ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుంచి సుమారు 20 మద్యం బాటిళ్లు, రెండు మోటార్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్‌కే అబ్దుల్ జలీల్ తెలిపారు. నిందితుల్లో ఒకరు జనసేన పార్టీ మండల మండల అధ్యక్షుడు. సెబ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెబ్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి మండలంలోని రుస్తుంవారిపల్లి(అడ్డరోడ్డు) ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. అక్కడ గోవాకు చెందిన మద్యం అమ్మకాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వారి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నటు చెప్పారు. బల్లిపల్లికి చెందిన ఇండ్లా రమేష్, చీర్లదిన్నెకు చెందిన అట్లా మోహన్‌రెడ్డి, గజ్జల నాగిరెడ్డిల దగ్గర సుమారు రూ. 50 వేల విలువైన 20 మద్యం బాటిళ్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సెబ్ ఏఈఎస్ డి.దత్తు, సెబ్ ఎస్సైలు వెంకటేశ్వరరావు, రేవతి, సిబ్బంది నాగేశ్వరరావు, బాలు, సుమంత్, పీవీ, కొండలు తదితరులు పాల్గొన్నారు.

అశ్లీల వీడియో కాల్స్ నిందితుడు అరెస్టు

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కార్యకర్తల సెల్‌ఫోన్లకు అశ్లీల వీడియో కాల్స్ మానసిక క్షోభకు గురి చేస్తున్న నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు..తమిళనాడు రాష్ట్రానికి చెందిన వడ్లమూడి దామోదర్ 30 ఏళ్ల క్రితం మంగళగిరికి చేరి హోటళ్లలో వంట మాస్టారుగా పనిచేస్తున్నాడు. అతని భార్య వదలి వెళ్లిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో దామోదర్ తన సెల్‌ఫోన్‌తో మహిళలకు వీడియో కాల్స్ చేసి ముఖం కనిపించకుండా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. ఇటీవల కాలంలో యర్రగొండపాలెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల సెల్ నంబర్లు సేకరించి వారిని అశ్లీల వీడియో కాల్స్‌తో వేధించేవాడు. ఈ విషయంపై కార్యకర్తలు ఈ నెల 12వ తేదీన సీఐ కె.మారుతికృష్ణను సంప్రదించి ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్సై రెండు టీంలుగా నిందితుడి కోసం గాలింపు మొదలు పెట్టారు. పెద్దారవీడు మండలంలోని కుంట వద్ద అనుమానంగా సంచరిస్తున్న దామోదర్‌ను పట్టుకొని విచారించారు. అశ్లీల కాల్స్ చేస్తున్నది తానేనని ఒప్పుకోవడంతో అతన్ని అరెస్టు చేసి మార్కాపురం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

టంగుటూరు: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జె.పంగులూరు మండలం బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ సెలక్షన్స్ నిర్వహించారు. అండర్ 14 విభాగంలో ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.తేజస్విని, సుదర్శి పూజిత, కసుకుర్తి లక్ష్మి కళ్యాణి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల మూడో వారంలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక


బాలికల జట్టు


బాలుర జట్టు

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ జిల్లాస్థాయి బాలబాలికల క్రీడాజట్ల ఎంపిక స్థానిక మినీ స్టేడియంలో ఆదివారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారని సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు తెలిపారు. ఎంపికలను జిల్లా సాఫ్ట్‌బాల్ కోచ్ డి.త్రినాథ్‌బాబు, కె.ప్రేమ్‌కుమార్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జరుగుమల్లి మండల విద్యాశాఖ అధికారి నాగేంద్రవదన్ పాల్గొని చదువుతోపాటు క్రీడలలోను రాణిస్తే ఉన్నతమైన అవకాశాలను త్వరగా అందిపుచ్చుకోగలుగుతామన్నారు. జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ ఎంపికైన బాలబాలికల జట్లు అక్టోబరు మొదటి వారంలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఆర్కిడ్స్ అజయ్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుర్రాభాస్కరరావు, బీటీఏ రాష్ట్ర నాయకులు పర్రె వెంకట్రావు, కొత్తపట్నం మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి రాత్రికింద కోటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు హాజీరాబేగం, కౌసల్య, కిరణ్ తదితరులు ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

బాలుర జట్టు:
కె.ప్రేమ్‌కుమార్(టంగుటూరు), సీహెచ్ కళ్యాణ్‌కుమార్(కాటూరిపాలెం), టి.గోపీకృష్ణ(బట్లపల్లి), యస్.సన్నీ(కొండమంజులూరు), పి.మణికంఠ(మున్నావారిపాలెం), వి.సంజయ్ (అల్లూరు), ఎ.పవన్‌కుమార్(టంగుటూరు), పి.హేమంత్(ఒంగోలు), జె.అశోక్(కొప్పెరపాడు), టి.దాస్టుమంగమూరు), కె.యగ్నేష్(ఉలవపాడు), ఎన్.సింహాద్రి(కందుకూరు), కె.వంశీ(ముత్యాలపాడు), వైవీఎస్ సాయి దీపక్(దర్శి)

బాలికల జట్టు..
కె.రమ్య, ఐ.అఖిల(బిట్రగుంట), ఐ.నాగవేణి(మైనంపాడు), యు.సింధూజ(గుడ్లూరు), ఎస్‌కే భాను, కె.జెస్సీ, ఆర్.దేవిక(చిరికూరపాడు), ఎ.పూర్ణాంషిక(ఒంగోలు), ఎల్.వర్షకావ్య(స్వర్ణ), డి.ప్రవల్లిక(త్రోవగుంట), పి.హారిణి(వై.పాలెం), అభిజ్ఞ, షహనాజ్(ఒంగోలు)

అనారోగ్యంతో మద్దిపాడు జెడ్పీటీసీ మృతి


జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సంతాపం
- కుటుంబానికి అండగా ఉంటామన్న ఎమ్మెల్యే

మద్దిపాడు: జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మండలంలోని అన్నంగి గ్రామానికి చేరుకొని జెడ్పీటీసీ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్పీటీసీ మృతికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధత కలిగిన మంచి నాయకురాలిని కోల్పోవడం బాధాకరమని, ఆమె మృతికి సంతాపం తెలిపారు. పార్టీ ఎల్లప్పుడు వారికి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వారి వెంట మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్లపాతల రవి, సన్నపు రెడ్డి రమణమ్మ, నర్రా సురేష్, సుబ్బయ్య, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, సన్నపురెడ్డి రమణమ్మ, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, బొమ్మల రామాంజనేయులు, పల్లపాటి లోకేశ్వరి అవినాష్, ఎంపీటీసీ రాయపాటి వెంకట సుజాత రమేష్, సుబ్బారెడ్డి, విల్సన్ కొమ్మూరి సుధాకర్ షేక్ బాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన జోసఫ్ మృతదేహం

ఒంగోలు టౌన్: మండలంలోని కరవది సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..ఉలిచి గ్రామానికి చెందిన మంచు జోసఫ్ (38) వ్యక్తిగత పనుల నిమిత్తం మోటారు బైకుపై కరవది వెళ్లి తిరిగి ఉలిచికి వస్తుండగా మార్గ మధ్యంలో ఎర్రమట్టిరేవు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తలకు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

గుడ్లూరు: పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన గుడ్లూరులో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని రాళ్లపాడు గ్రామానికి చెందిన మైదాల సుబ్బయ్య కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఉన్న తన చిన్న కుమార్తె దగ్గరకు వెళ్లి వస్తానని భార్య వరమ్మకు చెప్పాడు. అయితే ఆమె ఇప్పుడు వద్దు..తర్వాత వెళ్లు అని గట్టిగా చెప్పడంతో సుబ్బయ్య గుడ్లూరుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి వద్ద నుంచి గుడ్లూరుకు వచ్చాడు. మనస్తాపం చెందిన సుబ్బయ్య క్షణికావేశంలో పురుగు మందు డబ్బాను కొనుగోలు చేసి కొత్తపేటకు వెళ్లే రహదారిలో కాలువ పక్కన ఉన్న సమాధిపై కూర్చొని పురుగుల మందు తాగి అక్కడే పడిపోయాడు. స్థానికులు సుబ్బయ్య(75) దగ్గరకు వెళ్లి చూడగా నోటి నుంచి నురగ వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాదరెడ్డి సంఘటన స్థలం వద్దకు వచ్చి సుబ్బయ్యను పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు సుబ్బయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాదరెడ్డి ఆదివారం తెలిపారు.